నమస్తే తెలంగాణ
# జగిత్యాల
8 | కరీంనగర్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | JAGTIAL

## దసరా తర్వాత డిగ్రీ కళాశాలలు
# నిరవధిక బంద్

జగిత్యాలటౌన్ అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం, ప్రస్తుత ఉన్నత విద్య పూర్తి నిర్లక్ష్యానికి గురువుతున్న క్రమంలో దసరా తర్వాత కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు బకాయిల గురించి ఎన్ని సార్లు మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగినా, ముఖ్యమంత్రిని ఎన్ని సార్లు కలుద్దామని ప్రయత్నించినా కనీసం సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు విద్యా సంస్థల సమస్యను కనీసం వినే ప్రయత్నం కూడా చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ క్రమంలో డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు దసరా లోపు ఫీజు బకాయిలు చెల్లించకుంటే, ఫీజు బకాయిలపై సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఎస్‌యూ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు దసరా సెలవులు పూర్తయినా తెరవకూడదని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని యూనివర్సిటీ అధికారులకు కూడా తెలియజేసినట్లు వివరించారు.

## శైలపుత్రిగా అమ్మవారు


శైలపుత్రి అలంకారముతో అమ్మవారు

వేములవాడ టౌన్, అక్టోబర్ 3 : రాజన్న ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఉదయం వైభవంగా ప్రారంభం కాగా, మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6:30 గంటలకు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో నాగిరెడ్డి మండపంలో కొలువుదీరిన అమ్మవారి మండపం వద్ద పలు పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి అద్దాల మండపంలో ఈవో వినోద్‌రెడ్డి అర్చకులకు వర్ణి ఇచ్చి కార్యక్రమాలను ప్రారంభించారు. రాత్రి శైలపుత్రీ అలంకారంతో ఉన్న అమ్మవారిని పెద్దసేవపై హంస వాహనంలో ఉంచి పురవీధుల గుండా ఊరేగించగా భక్తులు దర్శించుకుని తరించారు.

స్మార్ట్‌సిటీ కరీంనగర్‌కు కేంద్రంతోపాటు బీఆర్ఎస్ సర్కారు నిధుల వరద పారించింది. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేయించింది. అయితే కాంట్రాక్టర్ల కక్కుర్తి, అధికారుల పర్యవేక్షణా లోపం ప్రగతికి నిరోధంలా మారింది. పనుల్లో నాణ్యతాలోపంతో అధ్వానంగా మారాయి. రోడ్లు రెండేళ్లకే పగుళ్లు చూపుతున్నాయి. ఫుట్‌పాత్, మల్టీపర్పస్ పార్కింగ్ టైల్స్ పగిలిపోతున్నాయి. కొన్నిచోట్ల కుంగిపోయి నడవడానికి వీలు లేకుండా తయారయ్యాయి. పది కాలాలపాటు నిలువాల్సిన పనులు ఇంత తొందరగా మరమ్మతులకు చేరడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా చేపట్టే పనులు నాణ్యతతో చేయాలని, ఆ మేరకు అధికారులు పర్యవేక్షణ పెంచాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


కట్టరాంపూర్ రోడ్డులో శిథిలమైన ఫుట్‌పాత్


విద్యానగర్ నుంచి యూనివర్సిటీ రోడ్డులో ఫుట్‌పాత్


శ్వేత హోటల్ పక్క రోడ్డు


బస్టాండ్ వెనుక రోడ్డులో అధ్వానంగా ఫుట్‌పాత్

# పర్యవేక్షణలోపం..
# నాణ్యత మాయం

- అప్పుడే వెక్కిరిస్తున్న స్మార్ట్‌సిటీ రోడ్లు
- అక్కడక్కడా పగుళ్లు
- కుంగిన ఫుట్‌పాత్‌లు.. లేచిపోతున్న టైల్స్
- ఎక్కడికక్కడ గుంతలు
- కాంట్రాక్టర్లు, అధికారులపై విమర్శలు
- మండిపడుతున్న నగరవాసులు


కాపువాడ నుంచి నాకచౌరస్తా రోడ్డు దుస్థితి


సాయికృష్ణ థియేటర్ రోడ్డులోని పరిస్థితి

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 3 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ సర్కారు కరీంనగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలోనే రెండో నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళ్లింది. మరోవైపు స్మార్ట్‌సిటీ జాబితాలో రాష్ట్రం నుంచి కరీంనగర్‌ను చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సఫలీకృతమైంది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టు స్మార్ట్‌సిటీలో నగరం ఎంపికైన తర్వాత కేంద్రంతోపాటు భారీగా నిధుల వరద పారించింది. వందల కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేయించింది. అందులో ప్రధానంగా దాదాపు ₹370 కోట్లతో ప్రధాన రహదారులతోపాటు లింకు రోడ్లను డెవలప్ చేశారు. వీటితోపాటు ఇరువైపులా మల్టీపర్పస్ పార్కింగ్, ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అయితే, కాంట్రాక్టర్ల కక్కుర్తి, అధికారుల పర్యవేక్షణ లోపం శాపంలా మారింది. పనులపై ఎప్పటికప్పుడు నిఘా లేకపోవడంతో నాణ్యత కొరవడింది. ఫలితంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్నాయి. జగిత్యాల రోడ్డు, లేబర్ అడ్డా రోడ్డు, విద్యానగర్, యూనివర్సిటీ రోడ్డు, కట్టరాంపూర్ రోడ్డు, భగత్‌నగర్ రోడ్డు, గాంధీ రోడ్డు ఇలా అన్ని ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు అప్పుడే మరమ్మతులకు చేరాయి. కొన్ని ప్రాంతాల్లో ఆయా వ్యాపార సంస్థల వల్ల చెడిపోగా.. అనేక ప్రాంతాల్లో టైల్స్ పగిలిపోయి, గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఫుట్‌పాత్, పార్కింగ్ ప్రాంతాల్లో టైల్స్ వేసే సమయంలో కింద సరిగా లెవల్ చేయకపోవడం వల్లే టైల్స్ అన్నీ దెబ్బతిన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్ అధికారులు ఈ పనులను పర్యవేక్షించకపోవడంతోనే కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా పనులు చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. వేసిన రెండు, మూడేళ్లకే ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ ప్రాంతాల పరిస్థితి ఇలా ఉండగా.. మరి కొన్ని ప్రాంతాల్లో రోడ్లలోనూ పగుళ్లు వచ్చాయి. అనేక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల్లో ఏర్పాటు చేసిన చాంబర్స్ పైకప్పులు కనిపించకుండా పోయాయి. అధికారులు అప్పుడే పక్కాగా పర్యవేక్షణ చేసుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు. పనులను నాణ్యతతో చేయించాలని, ఆ మేరకు అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

### మరమ్మతుల కోసం ఆదేశాలు ఇచ్చాం



నగరంలో ఫుట్‌పాత్‌లు, మల్టీపర్పస్ పార్కింగ్ స్థలాల్లో ఇబ్బందులు మా దృష్టికి కూడా వచ్చాయి. వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని ఇప్పటికే కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం. స్మార్ట్‌సిటీ రోడ్లన్నింటిల్లోనూ దెబ్బతిన్న వాటిని మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పలు ప్రాంతాల్లో భారీ వాహనాలు రావడం, కొన్ని ప్రాంతాల్లో యజమానులు చేపట్టిన పనుల మూలంగా టైల్స్ దెబ్బతిన్నాయి. వీటిని కూడా గుర్తించి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశాం.

**- చాహత్ బాజ్‌పాయ్, నగరపాలకసంస్థ కమిషనర్**

### రెండేళ్ల నిర్వహణ కాంట్రాక్టర్‌దే



స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన రోడ్లను మున్సిపాలిటీ తీసుకున్న తర్వాత రెండేళ్ల వరకు కాంట్రాక్టర్ నిర్వహణ చేయాలి. ఏయే రోడ్డు ఎప్పుడు తీసుకున్నామని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి, చెడిపోయిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయించాలి. కొన్ని ప్రాంతాల్లో యజమానుల వల్ల కూడా ఫుట్‌పాత్‌లు దెబ్బతిన్నాయి. ఎక్కడ చెడిపోయినా దానికి బాధ్యులు ఎవరో గుర్తించి మళ్లీ మరమ్మతులు చేయించేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచనలు చేశాం.

**- యాదగిరి సునీల్‌రావు, మేయర్ (కరీంనగర్)**


మహిళా డిగ్రీ కళాశాల సమీపంలోని ఫుట్‌పాత్


మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్

## బేషరతుగా క్షమాపణ చెప్పాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 3 : మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఆడ జన్మకే కలంకమని, మతి భ్రమించి మాట్లాడుతున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ మండిపడ్డారు. ఎంగిలి పూల బతుకమ్మ రోజు మంత్రి సురేఖ ఎంగిలి మాటలు మాట్లాడారని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మహిళా మంత్రులను అడ్డం పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొండా వ్యాఖ్యలపై మాట్లాడాలంటేనే అసహ్యం వేస్తున్నదని, రాజకీయాల్లో ఇలాంటి మహిళలు ఉన్నారంటే బాధగా ఉందన్నారు. రాష్ట్ర మంత్రి హోదాలో ఉండి కూడా సంస్కారహీనంగా బజారు భాష మాట్లాడారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి పేదల ఇండ్లను కూలుస్తున్నారని, దీంతో ప్రజలంతా బీఆర్ఎస్ వద్దకు వచ్చి తమ గోడును వెల్లబోసుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేకనే కేటీఆర్‌పై సురేఖ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని విమర్శించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఒక కాంగ్రెస్ మహిళ కమిషన్‌గానే కాకుండా మహిళల పక్షాన ఉండి, మంత్రి సురేఖ మాటలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జగిత్యాల, రాయికల్ ఏఎంసీ మాజీ చైర్మన్లు శీలం ప్రియాంక ప్రవీణ్, ఉదయ్‌శ్రీ, రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన పాల్గొన్నారు.

## ఆరుగురిపై పిచ్చికుక్క దాడి

చిన్నారి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడ్డ జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన అక్షర

జమ్మికుంట, అక్టోబర్ 3 : పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ ఆరుగురిపై దాడి చేసింది. అందులో మూడేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరపల్లి గ్రామానికి చెందిన ఉపేందర్–మీనా దంపతుల మూడేళ్ల కూతురు అక్షర ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్నది. ఇదే సమయంలో కుక్క సదరు చిన్నారిపై దాడి చేసింది. పాప అరుపులకు బంధువులు కుక్కను తరిమికొట్టారు. అప్పటికే అక్షరకు ముఖం, పెదవులు, కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అదే కుక్క గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ.. స్వరూప, వెంకటస్వామి, గట్టమ్మ, రితిక్(బాబు)తో పాటు మరో వృద్ధురాలిని కరిచింది. క్షతగాత్రులందరూ దవాఖానకు తరలివచ్చారు. వైద్యసిబ్బంది బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. కాగా, చిన్నారి అక్షరకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హన్మకొండకు తీసుకెళ్లారు. ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. కాగా, కుక్క కోసం గ్రామస్తులు గాలించగా అది దొరకలేదు. అయితే, గ్రామంలో కుక్కలు దాడి చేయడం ఇది కొత్తకాదని, గతంలోనూ పలువురిపై దాడి చేశాయని గ్రామస్తులు తెలిపారు. పిచ్చి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని అధికారులను కోరారు. కుక్కల బెడదపై మండలాధికారులకు సమాచారం ఇచ్చానని, చర్యలు చేపడతామని కార్యదర్శి రామారావు చెప్పుకొచ్చారు.


డిజిటల్ కార్డు వివరాల నమోదులో భాగంగా తాహెర్ కొండాపూర్‌లో వివరాలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## పథకాలకు డిజిటల్ కార్డే ప్రామాణికం

- పల్లెల్లో ప్రతి కుటుంబానికీ ఇస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 3 : రేషన్, హెల్త్, పింఛన్‌తోపాటు ప్రభుత్వ పథకాలన్నింటికీ డిజిటల్ కార్డే ప్రామాణికం అవుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గురువారం కరీంనగర్ మండలం తాహెర్ కొండాపూర్‌లో జరిగిన వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి స్వయంగా గ్రామంలోని పలు ఇండ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆధార్ కార్డు మాదిరిగానే ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజక వర్గాల్లో 288 చోట్లు ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభమైందన్నారు. కుటుంబం పరంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తామని, అందులో ఆస్తుల వివరాలు, ఆర్థిక లావాదేవీలు అడగరని, కుటుంబ సభ్యుల సంఖ్య, ఒక గ్రూప్ ఫొటో వంటి వివరాలు మాత్రమే అడుగుతారని తెలిపారు. డిజిటల్ కార్డు వివరాల నమోదులో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు ఎక్కడినుండైనా తీసుకోవచ్చని, కుటుంబ పెద్దగా మహిళ పేరు మీదే కార్డు వస్తుందని చెప్పారు. ఇప్పటికే కర్ణాటక, హర్యానా వంటి రాష్ట్రాల్లో ఈ కార్డులను అమలు చేస్తున్నారని, అధికారులు అక్కడ అధ్యయనం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ₹2 లక్షల లోపు ఉన్నవారికి రైతు రుణమాఫీ చేసిందని చెప్పారు. ₹2 లక్షల పైన ఉన్న వారికి దసరాలోగా మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారని, అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్, ఎంపీడీవో సంజీవరావు, కాంగ్రెస్ కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి కోసం
# నేతన్నల ఆందోళన

ఉపాధి కల్పించాలని సిరిసిల్లలో భారీ ధర్నా

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల నేత కార్మికులు ఆందోళనబాట పట్టారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో చేనేత జౌళిశాఖ ఎదుట భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేండ్లపాటు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని దొరికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీ బంద్ అయిందని, ఉపాధి లేక అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధార పడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని కలెక్టర్, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. వెంటనే యారన్ సబ్సిడీ విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.


సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతన్నలు

